# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 26-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.
- ❖ దీపం 2.0 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ పొందటానికి ఈనెల 31వ తేదీ ఆఖరి గడువని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- ❖ రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను ఈనెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 120వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

=========================

రాష్ట్రంలో ప్రతి జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. రెండవ రోజు కొనసాగుతున్న కలెక్టర్ల సదస్సులో భాగంగా ఈరోజు జోన్-1 పరిధిలోని జిల్లాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాయలసీమ నుండి ఉత్తరాంధ్ర వరకు పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యాటకాభివృద్ధి ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలతో పాటు, ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పర్యటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విశ్వనగరంగా వృద్ధి చెందుతున్న విశాఖలో కనీసం ఐదు వేల హోటల్ గదులు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. అదేవిధంగా అనకాపల్లి, అరకు ప్రాంతాల్లో కూడా అధునాతన వసతులతో పర్యాటకులకు ఆతిథ్యం కల్పించాలని కలెక్టర్లకు నిర్దేశించారు. తలసరి ఆదాయంలో విశాఖ జిల్లా రాష్ట్రంలోనే తొలి స్థానంలో ఉందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. రాష్ట్ర సగటు కన్నా విశాఖ ఎక్కువ తలసరి ఆదాయం సాధిస్తోందని పేర్కొన్నారు. విశాఖ తర్వాత అనకాపల్లి, అల్లూరి జిల్లాలు నిలుస్తున్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను ప్రోత్సహించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

========================

పార్వతీపురం మన్యం జిల్లాను డోలీల రహిత జిల్లాగా మార్చడానికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలిపారు. రెండవ రోజు కొనసాగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన ఈరోజు జిల్లా ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాలో గిరిజన ప్రజలు ఎక్కువగా ఉన్నారని, కొండ ప్రాంతాల్లో రహదారి సదుపాయం లేక డోలీలు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు రహదారి సదుపాయం కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా తలసరి ఆదాయం 1.67 లక్షల రూపాయలుగా ఉందని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1.94 లక్షలకు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా ప్రగతికి పర్యాటరంగం ఎంతో దోహదపడుతుందని, పర్యాటక రంగంలో జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేశామన్నరు. జిల్లాలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు.

========================

దీపం 2.0' పథకం కింద రాష్ట్రంలో ఇప్పటి వరకూ 98 లక్షల మంది మహిళలు ఉచిత గ్యాస్ మొదటి సిలిండర్లను వినియోగించుకున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు ఆయన అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ... మహిళలకు సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం మార్చి 31 వరకే సమయం ఉందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

========================

రేషన్ లబ్దిదారులు ఈకేవైసీ ప్రక్రియను ఈనెల 31వ తేదీకి నాటికి నూరు శాతం పూర్తి చేయాలని పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ సూరజ్ పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ... గ్రామ వార్డు సచివాలయాల్లోనూ, రేషన్ షాపులలో డీలర్ వద్ద ఉన్న ఈ-పాస్ పరికరాలు ద్వారా, లేదా మొబైల్ యాప్ ద్వారా ఈకేవైసీని పూర్తి చేయవచ్చన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలు మినహా, మిగిలిన లబ్దిదారులతో ఈకేవైసీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇది ముఖ్యంగా రేషన్ పంపిణీ వ్యవస్థను సక్రమంగా అమలు చేయడానికి ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

========================

ఫార్మా రంగంలో శ్రీకాకుళం జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోందని కలెక్టరు స్వప్నిల్ దినకర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన ఈరోజు శ్రీకాకుళం జిల్లా ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో ఫార్మా సంస్థల నుంచి కెమికల్ ఇంజినీర్లకు అధిక డిమాండ్ ఉందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే కెమికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా కోర్సులు ప్రారంభించామన్నారు. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తలసరి ఆదాయం

1.85 లక్షల రూపాయలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో రైతులు కేవలం వరి పంట మాత్రమే ప్రధానంగా సాగు చేస్తున్నామని, ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా కూడా ప్రోత్సహించనున్నామన్నారు. జిల్లాలో అరసవల్లి, శ్రీకూర్మం పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలుగా ఉన్నాయని, పర్యాటకరంగం పరంగా కూడా జిల్లాను అభివృద్ధి చేయనున్నామన్నారు. అలాగే జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ కూడా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టూల్స్ ఉపయోగించడంపై ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.

=========================

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు మంత్రి అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ... పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం పారదర్శకంగా దర్యాప్తు చేస్తోందన్నారు. దీనిని కేవలం రోడ్డు ప్రమాదంగా మాత్రమే పరిగణించటం లేదని, ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపడుతున్నామన్నారు. రాజకీయంగా, మతపరంగా ఎవరు విద్వేషాలు సృష్టించదద్దని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావం అవసరం లేదని హోం మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

=========================

కూటమి ప్రభుత్వంలో సముద్ర తీర గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం కోమటితిప్ప గ్రామంలో 40 లక్షల రూపాయలతో సిసి రోడ్డుకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రవాణా, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందన్నారు.

=========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి పి.రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి పదవ తరగతి, GNM, ANM లేదా ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ జాబ్ మేళాకు ధ్రువ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

=========================

దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు మీదుగా ఉత్తర-దక్షిణ ద్రోణి సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే దిగువ ట్రోపో ఆవరణంలో ఆంధ్రప్రదేశ్, యానాంలలో దక్షిణ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వెల్లడించింది. వీటి ప్రభావంతో రేపు రాష్ట్రంలో 2 నుండి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

=========================
=========================